క్లుప్తంగా

'అనపర్తి' కుటుంబానికి పరామర్శ



ముక్కొల్లులో కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. కాగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం సోమవారం ముక్కొల్లులో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, తోట నరేంద్ర, తోట వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

కిర్లంపూడి: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సామాజిక వేత్త పాటంశెట్టి సూర్యచంద్ర సూచించారు. బూరుగుపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద పరిశుభ్రతపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేసిన విద్యార్థులకు బహుమతులు, స్వచ్ఛ విద్యార్థి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పాటంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా నాగరాజు



ప్రత్తిపాడు: స్థానిక మార్కెండేయ పద్మశాలి సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా గిడుతూరి నాగరాజు (ఎల్ఐసీ నాగరాజు) ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. స్థానిక జక్కావారి రామాలయ ఆవరణలో సోమవారం సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సంఘ ఉపాధ్యక్షుడిగా బండారు మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా జక్కా సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్వీ సోమేశ్వరరావు, కోశాధికారిగా బేతా సత్యనారాయణ ఎంపికయ్యారు. మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘ సమన్వయ కర్తలు బండారు పెదబాబు, జంధ్యం సుబ్బారావు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరులో బాధిత కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన బుర్ర భీమరాజు భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. ఆయన కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి రూ.ఐదు వేలు అందజేశారు. అనారోగ్యంగాతో బాధపడుతున్న గ్రామానికి చెందిన బొంద్రు రిబకను పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలుగు బంటి బాబ్జి, చీప్తి నాగేశ్వరరావు, కోలా తాతబాబు, దెందుకూరి హరిరాజు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు, కోలా సూరిబాబు, అంబటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపు ప్రారంభం

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎడ్జ్ ఏఐ, ఐఓటీ, ఇంటెలిజెన్స్‌పై మూడు రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించినట్టు చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగాల్లో ఏఐ ప్రభావం, క్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ వి.సాయి పావన్, డైరెక్టర్ ఎంవీ హరనాథ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నేటి నుంచి శిక్షణ

రౌతులపూడి: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకూ శిక్షణ ఇస్తారన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు అందరూ తప్పనిసరిగా హాజరై శిక్షణ పొందాలని సూచించారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపాటు
- వాడీవేడిగా మండల సమావేశం



డిప్యూటీ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: ప్రజా సమస్యలను పక్కనబెట్టి అధికారపార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్న అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ రైతు తన పొలంలో మట్టిని ఒక మడి నుంచి మరొక మడికి తరలించుకుంటుంటే అధికారి పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు ఆ రైతుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నిబంధనలు తుంగలోకి తొక్కి అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, సభలు, సమావేశాల నిర్వహణలో కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం కూడా ఇవ్వకుండా అగౌరవపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, రెవెన్యూ, విద్య, వైద్యం, ఉపాధి హామీ, విద్యుత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, మండల మహిళా సమాఖ్య, హౌసింగ్ శాఖల పనితీరును ఎంపీడీఓ వెంకటనారాయణ సమీక్షించారు. మండలంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఎంపీడీఓ వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సభ ముందుకు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం దిశగా అధికారులు అడుగులేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్‌ను విస్మరించినా, నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌లను ఎంపీడీఓ ప్రవేశపెట్టగా మండల పరిషత్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



గోకవరం మండలంలో ప్రధాన రహదారి చెంత నేలకొరిగిన వృక్షాలు



కొత్తపల్లి శివారున తెగిపడిన విద్యుత్‌వైర్లు

హోరు గాలి.. జోరు వాన

గోకవరం: మండలవ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఐదు గంటలకు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు కొత్తపల్లి శివారున ప్రధాన రహదారి చెంత ఉన్న వృక్షాలు నేలకొరిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షానికి సేదతీరారు.

గండేపల్లి: అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న మండల ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి సేదతీరారు. ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది.

దొరబాబు కుటుంబానికి పరామర్శ



ఎస్.అన్నవరంలో దొరబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

తుని రూరల్: ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుసనం దొరబాబు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు సోమవారం పరామర్శించారు. ఎస్.అన్నవరంలోని దొరబాబు ఇంటికి వెళ్లి అతని భార్య, పిల్లలను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీకి దొరబాబు అందించిన సేవలను కొనియాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నరిశే శివగణేష్, చిక్కాల వెంకటేశ్వరరావు, కుసనం కుమార్, కుసనం శివాజీ, నరిశే సత్యనారాయణ, అత్తిలి మురళి, యన్నా సూర్యారావు, ముత్తా సత్తిబాబు, చిక్కాల ప్రసాద్, జీను బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని వేములపాలెం గ్రామానికి చెందిన పిల్లి రమణ కుమారుడు సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని గిరిబాబు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, చందక నాని, పిల్లి నాగేశ్వరరావు, తుట్టా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దోశ కుటుంబానికి ముద్రగడ గిరిబాబు పరామర్శ

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన దోశ ధనబాబు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సోమవారం పరామర్శించారు. ధనబాబు మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ధనబాబు, కుటుంబ సభ్యులను గిరిబాబు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెదశంకర్లపూడి మాజీ సర్పంచ్ దోశ నల్లబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయాలి



రౌతులపూడిలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శివరామకృష్ణయ్య

రౌతులపూడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పీ4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులకు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా వీధి కుళాయిలు, పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పీ4 సర్వే

ప్రత్తిపాడు: గ్రామాల్లో చేపట్టిన పీ4 సర్వే నిష్పక్షపాతం జరుగుతోందని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలోని చినశంకర్లపూడిలో సోమవారం పీ4 సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే జాబితాలో ఏమైనా లోపాలుంటే తక్షణమే సరిచేసేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఈఓఆర్డీ కేవీవీఎస్ఎన్ కాశీ విశ్వనాథం, కార్యదర్శి బర్రే వీరబాబు, కస్తూరి తేజాప్రతాప్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో డిజైన్ ఫర్ 3డీ ప్రింటింగ్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్ సోమవారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మెకానికల్ విభాగాధిపతి ఎస్‌డీవీవీఎస్ భీమేశ్వరరెడ్డి, పి.జైకిషన్, వీఎస్ సూర్య ప్రకాష్ రీసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించి విద్యార్థులకు డిజైన్, మాన్యుఫాక్చరింగ్ రకాలు, అడ్వాన్స్‌డ్ 3డీ మోడలింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్ రమాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై వర్క్‌షాప్

ఆదిత్య మెకానికల్ విభాగంలో డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై వర్క్‌షాప్‌ను ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ డీన్, అడ్మినిస్ట్రేషన్ వైకే ఎస్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పులిమేరులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలపై మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు.

పరీక్షలకు 20 మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కిర్లంపూడి జూనియర్ కాలేజ్, జగపతినగరం ప్రగతి ప్రైవేట్ పాఠశాల, కిర్లంపూడి, గెద్దనాపల్లి, తామరాడ, బూరుగుపూడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. మ్యాథ్స్ పరీక్షకు 995 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 975 మంది హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు.

ప్రత్తిపాడు మండలంలో 17 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని లంపకలోవ పరీక్ష కేంద్రంలో 250 మందికి 241 మంది, ప్రత్తిపాడు పరీక్ష కేంద్రంలో 190 మందికి 187 మంది, ఒమ్మంగి ఎ కేంద్రంలో 101 మందికి 104 మంది, ఒమ్మంగి బి కేంద్రంలో 200 మందికి 198 మంది, ధర్మవరం పరీక్ష కేంద్రంలో 125 మందికి 123 మంది వెరసి 866 మందికి 849 మంది పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.

28 నుంచి క్వారీ కార్మికుల సమ్మె



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న క్వారీ కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 28 నుంచి సమ్మె చేయనున్నట్టు ఉభయగోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుప్పల నాగభూషణం తెలిపారు. స్థానిక క్వారీ కార్మిక భవనంలో సోమవారం ఆయన అధ్యక్షతన సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ క్వారీ కార్మికుల వేతనాలు పెంచాలని యాజమాన్యాన్ని కోరగా ఈ నెల 24 వరకూ గడువు ఇచ్చారన్నారు. గడువు ముగిసినా యాజమాన్యం విన్నపం మేరకు సమ్మె వాయిదా వేశామన్నారు. దీనిపై యాజమాన్యాన్ని సంప్రదించగా మంగళవారం చర్చలకు సిద్ధమైనట్టు తెలిపారు. చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లేకుంటే ఈ నెల 28 నుంచి సమ్మెబాట పట్టాలని యూనియన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు దేరంగుల రాజు, రాయుడు చిన్నా, బత్తుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉగాది కానుకలు



జగ్గంపేటలో పారిశుధ్య కార్మికులకు ఉగాది కానుకలు అందజేస్తున్న సర్పంచ్ నాగరత్నం

జగ్గంపేట: స్థానిక పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం ఉగాది కానుకలు అందజేశారు. పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ బచ్చల నాగరత్నం కార్మికులకు ఉగాది కానుకగా నూతన వస్త్రాలు, రూ.500 చొప్పున నగదు అందజేశారు. పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలను కొనియాడారు. కాగా గ్రామ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, ప్రణాళికలపై గ్రామ సభలో చర్చించారు. ప్రాధాన్యతా క్రమంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివ, స్థానిక నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, జీనుమణిబాబు, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలి

శంఖవరం: గ్రామాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని ఎంపీపీ పర్వత రాజుబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత 2025–26 సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు డ్రైన్లలో పూడిక తీయించాలన్నారు. రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు శివమణికంఠ



శివమణికంఠకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

కోటనందూరు: రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్– 2025కు మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి కొరుప్రోలు శివమణికంఠ ఎంపికయ్యారు. ఏపీ అసెంబ్లీలో జరిగే యూత్ పార్లమెంటులో శివమణికంఠ కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. యూత్ పార్లమెంటు–2025లో పాల్గొనే అవకాశం కోసం కాకినాడ జిల్లా నుంచి వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఒక్క నిమిషం వీడియోను మై భారత్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారిలో స్క్రీనింగ్ ద్వారా 150 మందిని ఎంపిక చేశారు. వీరికి సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 22న యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. దీనిలో శివమణికంఠ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి టాప్ 10లో ఒకరిగా ఎంపికయ్యారు. ఈ నెల 28న ఏపీ అసెంబ్లీలో స్పీకర్ ముందు ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే అంశంపై శివమణికంఠ మాట్లాడనున్నారు. శివమణికంఠ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు కాగా ప్రస్తుతం విజయనగరం కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ బోటనీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రతిభ కనబరిచిన శివమణికంఠను అధ్యాపక బృందం, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

గోకవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుతంగా ర్యాలీ చేసి నిరసన తెలిపారు. స్థానిక దేవిచౌక్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవీచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి తహశీల్దార్ సాయిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాలలను అనగదొక్కే విధంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వద్ద సరైన సమాచారం లేకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడం దారుణమన్నారు. వర్గీకరణ ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుల్లా ఏడుకొండలు, బూలా అబ్బులు, బిజ్జి రాజు, అంబటి అబ్రహం, మడికి మైనర్‌బాబు, అంబటి జయబాబు, మచ్చా మోహన్, మచ్చా మురళి, అంబటి ప్రసన్న, గోలి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ సభ్యులు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రహరీ నిర్మించాలని, తాగునీరు, వసతులు కల్పించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై విజయోత్సవాలు

గోకవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పెరవలి పండు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అధ్యయనానికి నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికపై రాష్ట్ర క్యాబినేట్, అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేద పండితునికి జ్యోతిర్మిత్ర బిరుదు



శేషగిరిశాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గండేపల్లి: మండల కేంద్రమైన గండేపల్లికి చెందిన మహర్షి జ్యోతిషాలయం నిర్వాహకుడు, దేవీ ఉపాసకుడు, వేద పండితుడు దువ్వూరి శేషగిరి శాస్త్రి(సిద్ధాంతి)కి జ్యోతిర్మిత్ర బిరుదు లభించింది. హైదరాబాద్‌కు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ నిర్వాహకులు విజయవాడలో నిర్వహించిన జ్యోతిష సభలో ఉగాది పురస్కారంగా ఈ బిరుదును ప్రదానం చేశారు. ఆయనకు పలువురు జ్యోతిష పండితులు, నేతలు, గ్రామస్తులు సోమవారం అభినందనలు తెలిపారు.

అరుణాచలేశ్వరస్వామికి విశేష పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పండితులు స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రసాదాలను స్వీకరించారు.

15 మంది రౌడీ షీటర్ల బైండోవర్

గండేపల్లి: జగ్గంపేట సర్కిల్ పరిధిలో 15 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్టు సీఐ వైఆర్కె శ్రీనివాస్ తెలిపారు. వీరిని సోమవారం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, మహిళల పట్ల దురుసుగా, ఇబ్బందికరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తొండంగి: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోపాలపట్నం, అన్నవరం, బెండపూడి ఎ.కొత్తపల్లి గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

- ఘనంగా ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ర్యాలీ చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది



ఏలేశ్వరంలో క్షయ నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ఏలేశ్వరం: క్షయవ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డి.శైలజ కోరారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని వైద్యాధికారి శైలజ, టీబీ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్ మీదుగా బాలాజీచౌక్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వంశపారపర్యంగా వచ్చే వ్యాధి కాదన్నారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన మందులను ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పొందవచ్చన్నారు. అనంతరం క్షయవ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యురాలు సరోజ, విజయలక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఆదినారాయణ ఎస్ఎస్ఎంలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ వైద్యాధికారుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి టి.సాయిహేమాంజలి ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్షయవ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్స్, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు వై.శ్రీరామ్, పూజ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ కొనసాగింది. స్థానిక మెయిన్ రోడ్డులో మానవహారంగా ఏర్పడి క్షయ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ శ్రీరామ్ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు

శంఖవరం: మండలంలోని సీతంపేట రిఫరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిఫరల్ ఆసుపత్రి చైర్మన్ స్లైసర్ బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించి చికిత్స అందిస్తే నివారించవచ్చన్నారు. క్షయ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాజీవ్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం క్షయ నివారణపై వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.